# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

## ఏరుకొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి



ప్రముఖ సంగీతదర్శకుడు రమేష్ నాయుడు గారికి ఒక వింత అలవాటు ఉండేదట. ఆయన ఎప్పుడూ ‘టైగర్ బామ్‘ డబ్బాని దగ్గరే ఉంచుకునే వారు. కొత్తపాటకి బాణీ కట్టాలంటే ముందుగా టైగర్ బామ్‌ని ముక్కుపుటాలకి, మెడకి దట్టంగా పట్టించి ఆ సెగల్లోంచి సుగంధ పరిమళాల సంగీత స్వరాలు సృష్టించేవారు.

***



మరో సుప్రసిద్ధ సంగీత దర్శకులు రసాలూరు రాజేశ్వర రావు గారు మంచి చమత్కార సంభాషణా ప్రియులు. ఓ మహా గాయకుడు ఎన్ని సార్లు పాడినా సరిగా కుదరడం లేదట... చివరికి రాజేశ్వరరావు గారు ఆయనతో..”మాస్టారూ ఇంక టేక్ చేసేద్దాం..ఈ సారి శృతిలో పాడండి చాలు..!” అన్నారు..( అంత వరకూ తను ఎలా పాడేనో తెలుసుకున్న మహాగాయకుడి ముఖాన్ని మీరే ఊహించుకోండి)

ఓ సారి ఆయన్ని ‘రైలు ఇంజన్ కూత ఏ రాగం మాస్టారూ‘ అని అడిగితే ‘ అది చిత్తరంజన్ లో తయారైంది కాబట్టి రాగం ‘చిత్తరంజని‘ అయ్యుంటుంది ‘ అన్నారాయన..!

ఓ సారి ఓ దర్శకుడికి ఎన్ని రాగాలు కూర్చినా నచ్చకపోయే సరికి ” అయ్యా..తమరిచ్చిన మాటలు మారలేదు.. వాటికి నేను చేసిన ట్యూన్లు ఆరు.. ఆరూ ఆరు రాగాలలో చేసినా మీకు ఏదీ నచ్చలేదు..ఇంక మిగిలింది ఒక్కటే రాగం ఆరున్నొక్క రాగం.. దాన్లో చేస్తే తప్ప మీకు నచ్చేటట్లు కనిపించడం లేదు..” అన్నారు.

***

‘ప్రేమబంధం‘ సినిమాకోసం వేటూరి గారు ‘చేరేదెటకో తెలిసి.. చేరువకాలేమని తెలిసి - చెరి సగమైనా మెందుకో తెలిసి ‘ అనే పల్లవితో ఒక పాట రాసారు. ఇదీ ఒరిజినల్ వెర్షన్. ఈ పాదాలు



జాగ్రత్తగా గమనిస్తే మొదటి పంక్తికీ రెండో దానికీ తాళం కలవదు. మాత్రల ప్రకారం కూడా వాటికి సఖ్యత లేదు. సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్, సహాయకుడు పుగళేందిల సమక్షంలో పాటని అర్థం పోకుండా ఎలా సరి చేయాలా అని వేటూరి గారు మధన పడుతుంటే..మహదేవన్ గారే..''ఏమీ వద్దుకానీ ఇలా చూడండి..'' అని రెండో పంక్తిలోని 'తెలిసి' అన్న పదాన్ని అదనంగా రెండు సార్లు చేర్చారు..

అప్పుడా పంక్తి ఇలా అయింది..

చెరి సగమైనా మెందుకో తెలిసీ తెలిసి తెలిసీ..''

సంగీతదర్శకుడిలో ఇలాంటి సమయస్ఫూర్తి ఉన్నప్పుడే కలకాలం నిలిచిపోయే స్వరరాగ సుధలు ప్రవహిస్తాయి..!

***



అలనాటి మేటి హాస్యనటుడు రేలంగి తరచు సెట్స్ మీద జోక్స్ వేస్తుండేవారు. ఒక సారి తోటి నటుడితో..''ఏమండీ కొరియా యుద్ధం ఎంతవరకూ వొచ్చింది..'' అని అడిగారు రేలంగి.

''అదేమిటండీ..అది ఆగిపోయి ఐదేళ్ళు దాటింది కదా..'' అన్నాడా తోటినటుడు.

''అది కాదు బాబూ..మొన్న నెవరినో అడిగితే 'గనోక్వైల్' దాకా వచ్చిందన్నారే..'' రేలంగిగారే ఇంకా పొడిగించారా సంభాషణని.

''అదేమిటి సార్..గనోక్వైల్ అంటే దగ్గు మందు కదా..'' అన్నాడా నటుడు అమాయకంగా..

''అది నాకు తెలుసండీ బాబు..మీకా విషయం తెలుసో లేదో టెస్ట్ చేద్దామని అడిగానంతే..'' రేలంగి గారి గడుసు సమాధానం.!

***



వరూధినిలో ఎస్వీఆర్



అజరామరమైన నటుడు ఎస్వీ రంగారావు గారి పూర్తి పేరు సామర్ల వెంకట రంగారావు. సినిమాల్లో ప్రవేశించడానికి ఆయన చాలా బాధలు పడ్డారు. చివరికి 1946లో ఆయనకి కాస్త దగ్గర బంధువైన బి.వి.రామానందం అనే ఆయన 'వరూధిని' సినిమా తీస్తూ దాన్లో రంగారావు గారికి ప్రవరాఖ్యుడు పాత్ర ఇచ్చారు. ఐతే ఆ సినిమా దారుణంగా ఫ్లాప్ ఐంది. దానితో రంగారావు గారు దాదాపు మూడేళ్ళపాటు అజ్ఞాతంలో ఉండిపోయారు. ఐతే ఎలాగైనా మళ్ళీ సాధించాలన్న పట్టుదలతో 1948లో మళ్ళీ మద్రాసు వెళ్ళారు. ఎక్కడికి వెళ్ళినా 'వరూధిని హీరో వా బాబూ.. వెళ్ళిరా..'' అనే వారే తప్ప ఎవరూ వేషం ఇవ్వలేదు. అతి కష్టం మీద 1950లో 'పల్లెటూరి పిల్ల' లో ఒక చిన్నపాత్ర వచ్చింది. కానీ పెద్దగా పేరు తీసుకురాలేదు. అదే సంవత్సరం 'షావుకారు' చిత్రంలోని సున్నం రంగడి పాత్రతో నిలదొక్కుకుని తరువాత ఆయన సృష్టించిన రికార్డులు అందరికీ తెలిసినవే..

***



అమరగాయకుడు ఘంటసాల గారు ముందుగా ఫిడేలు నేర్చుకుందామని విజయనగరం వెళ్ళారు. అప్పటి సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ద్వారం వెంకటస్వామి నాయుడు గారు ఘంటసాలగారి కంఠ స్వరం విని "నాయనా! నువ్వు గాత్రం నేర్చుకో. మంచి కంఠం వుంది గనుక అందులో రాణిస్తావు" అని సలహా ఇచ్చారు. ఆ సలహానే లేకపోతే ఘంటసాల బహుశా వయొలినిస్ట్ గానే మిగిలి పోయే వారేమో..! సినిమాల్లో అవకాశాలకోసమని వెళ్ళినప్పుడు తనకున్న హరికథలూ, నాటకాల అనుభవంతో నటుడి పాత్రలకోసం ప్రయత్నించారు. ఏ నిర్మాతా ఆయనకి నటుడిగా అవకాశం ఇవ్వలేదు. హెచ్.ఎమ్.వి సంస్థకి ఆడిషన్ కి వెళితే " నీ గొంతు మైక్ కి పనికి రాదు..వెళ్ళిపో.." అన్నారు..!
ప్రతిభ ఉన్నప్పుడు కొంచెం ఆలశ్యమైనా అవకాశాలు వస్తాయనీ, వచ్చిన అవకాశాలని సద్వినియోగం చేసుకుంటే ఆ కళాకారుడు కలకాలం నిలదొక్కుకోగలడనీ తరువాతి కాలంలో చరిత్ర సృష్టించిన ఘంటసాల నిరూపించారు.

ఘంటసాల గారు తన సోదరుడు సదాశివుడిని నిర్మాతగా చూడాలన్న ఆశతో మూడు సినిమాలు నిర్మించారు.. 'పరోపకారం'(1953), సొంతవూరు(1956), భక్తరఘునాథ్ (1960). దురదృష్టవశాత్తూ మూడు సినిమాలూ పరాజయం పాలయ్యాయి. ఎవరైనా వాటిగురించి అడిగితే - ఆయన ఇలా చెప్పేవారు..
"మొదటి చిత్రం పరోపకారం ఐపోయింది బాబూ..రెండోది సొంతవూరికి ప్రయాణం కట్టమంది. మూడోది నోరుమూసుకుని భజన చేసుకుని బ్రతకమంది."

***



అలనాటి ప్రముఖ సినీ రచయిత మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు ప్రాక్టికల్ జోక్స్ వేయడంలో మహా దిట్ట. మద్రాసులో ఆయన ఉండే ఇంటికి ఎదురుగానే 'రాజనందిని' సినిమా తీసిన జలరుహ ప్రొడక్షన్ ఆఫీసు ఉండేది. సినిమా కథా చర్చలకోసం దర్శకుడు వేదాంతం రాఘవయ్య గారితో డిస్కషన్స్‌కి రమ్మని పిలుపు వచ్చింది. "వస్తాను...కానీ కారు పంపించండి..' అన్నారాయన. వచ్చినతను ఆశ్చర్యపోయాడు..ఎదురుగుండా ఉన్న ఇంటికి కారు ఎందుకా అని.
"మర్యాద బాబూ..నేను నడుచుకుంటు వస్తే మిగతా వాళ్ళు నన్ను చూసి ఫేమస్ రైటర్ కూడా నడుచుకుంటూ వెళుతున్నాడు అంటారు. అంచేత కారు తెచ్చు వీధిలో మధ్యన పెట్టండి.." అన్నారాయన.
ప్రొడక్షన్ అతను అలానే చేసాడు. శాస్త్రి గారు ఇటువైపునుంచీ తలుపు తెరుచుకుని కారులో ఎక్కి అవతల వైపు తలుపు తీసుకుని బయటికి దిగి ఆఫీసులోకి వెళ్ళిపోయి అందరినీ నవ్వించారు. ..అదీ ఆయన చమత్కారం..!

# సంగీతదర్శకులూ - మొదటి సినిమాలు

| | |
|---|---|
| గాలి పెంచల నరసింహా రావు | - సీతా కళ్యాణం (1934) |
| ప్రభల సత్యన్నారాయణ | - లవకుశ(1934) |
| మారుతి సీతారామయ్య | - బాలయోగిని(1936) |
| భీమవరపు నరసింహారావు | - ద్రౌపదీ వస్త్రాపహరణం(1936) |
| ఆకుల నరసింహా రావు | - శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యం (1939) |
| చిత్తూరు నాగయ్య | - వందేమాతరం( 1939) |
| సాలూరి రాజేశ్వర రావు | - జయప్రద (1939) |
| సి. ఆర్.సుబ్బరామన్ | - రత్నమాల |
| ఎస్.హనుమంతరావు | - రాధిక (1947) |
| పెండ్యాల నాగేశ్వర రావు | - ద్రోహి (1948) |
| ఘంటసాల | - మనదేశం (1949) |
| ఆది నారాయణ రావు | - పల్లెటూరి పిల్ల (1950) |
| అశ్వత్థామ | - బీదలపాట్లు(1950) |
| టి.వి.రాజు | - టింగురంగడు (1952) |
| టి.చలపతిరావు | - పుట్టిల్లు(1953) |
| మాస్టర్ వేణు | - అంతా మనవాళ్ళే (1954) |
| రమేష్ నాయుడు | - దాంపత్యం (1957) |
| ఎస్.పి.కోదండపాణి | -కన్న కొడుకు (1961) |
| మాస్టర్ సత్యం | - పాలమనసులు(1968) |
| జి.కె.వెంకటేష్ | - అత్తగారు - కొత్తకోడలు (1968) |
| పి.లీల | - చిన్నారి పాపలు (1968) |
| ఎ.ఎ.రాజ్ | - దేవుడిచ్చిన భర్త (1969) |
| జె.వి.రాఘవులు | - ద్రోహి (1970) |
| ఎ.కుమార్ | - సంబరాల రాంబాబు (1970) |

| | |
|---|---|
| చక్రవర్తి | - మూగప్రేమ (1971) |
| ఇళయరాజ్ | - భద్రకాళి (1976) |
| బాలసుబ్రహ్మణ్యం | - కన్యాకుమారి (1977) |
| హంసలేఖ | - ముత్యమంత ముద్దు |
| రాజ్ - కోటి | - ప్రళయగర్జన |
| శ్రీలేఖ | - తాజ్ మహల్ |

***

## ఆత్రేయ మరికొన్ని మరపురాని గీతాలు..

గత సంచికల్లో ఆత్రేయ గారు వ్రాసిన కొన్ని సినిమా పాటల్లోంచి 'మనసు' గురించిన మంచి మాటలు చదివారు..ఈ సంచికలో మరికొన్ని మీకోసం..చదవండి.. ఆలోచించండి..



మాటలలో చిక్కుపడి మనసు నలిగిపోతుంది
మనసులేని మాటలనే మనం నమ్ముతున్నది
పలుకలేని ప్రతి గుండె బాధతో నిండినది
ఒలికే ప్రతి కన్నీటి చుక్క వెచ్చగా ఉంటుంది
(భార్యా బిడ్డలు చిత్రంలో 'బతుకుపూలబాట కాదు..' పాటనుంచి.)

తనువుకు ప్రాణం కాపలా - మనిషికి మనసే కాపలా
ఎవరి ప్రేమకు నోచని నాడు కన్నీరేరా నీకు కాపలా
(ఇంటికి దీపం ఇల్లాలే చిత్రంలో 'ఎవరికి ఎవరు కాపలా..' పాట నుంచి)

మంచి వాడికి, చెడ్డవాడికి తేడా ఒకటే బాబూ
మంచివాడు మనసున అనుకుంటాడు చెడ్డవాడు చేసి చూపిస్తాడు
(పాపకోసం సినిమాలో 'మనిషి మనిషికి తేడా ఉంది..' అనే పాట నుంచి)

కన్ను నీదని, వేలు నీదని పొడుచుకుంటే రాదా రక్తం

రక్తమెంతగా ధార పోసినా దొరుకుతుందా మళ్ళీ హృదయం..!?

(సెక్రటరీ చిత్రం లోని 'మనసులేని బ్రతుకొక నరకం' పాట నుంచీ)

తప్పు నాది కాదంటే లోకమొప్పుతుందా

నిప్పులాంటి సీతనైన తప్పు చెప్పకుందా?

(త్రిశూలం సినిమాలో 'రాయిని ఆడది చేసిన..' పాట నుంచీ)



ప్రేమనేది ఉన్నదా

అది మానవులకే ఉన్నదా

హృదయముంటే తప్పదా

అది బ్రతుకుకన్నా గొప్పదా?

(ప్రేమలు-పెళ్ళిళ్ళు చిత్రంలో 'మనసులేని దేవుడు..' పాట నుంచీ.)

తేటి ఎగిరిపోతుంది పువ్వు మిగిలిపోతుంది

తేనె ఉన్న సంగతి తేటి గురుతు చేస్తుంది

(కొడుకు కోడలు సినిమా లోని 'ఇదేనన్నమాట..' పాట నుంచీ)

వచ్చింది ఎందుకో తెలిసుంటే వెళ్ళవు

వెళ్ళేది తెలిసుంటే అసలొచ్చి ఉండవు..

(మనసు-మాంగల్యం చిత్రం లోని 'ఎందుకు వచ్చావో..' పాటనుంచీ)

ఒడ్డున పెరిగే గడ్డిపోచకు హృదయం ఎందుకు ఉండకూడదు

ఉందని ఎందుకు ఒప్పుకోరాదూ

మోడు కూడా చిగురించాలని మూగమనసు కోరే కోర్కెను

మోసం ద్రోహం అనడం అన్యాయం..

(ఇది కథ కాదు చిత్రంలోని 'అటు ఇటు కాని..' పాట నుంచీ.)